క్లుప్తంగా

రేపు తిరుపతిరావు నామినేషన్

మైలవరం: వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు శనివారం ఉదయం 10 గంటలకు తన నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తారని పార్టీ కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. మైలవరం పార్టీ కార్యాలయం నుంచి ఊరేగింపుగా బయలుదేరి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల అధికారికి తన నామినేషన పత్రాలు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఒకేఒక్క నామినేషన్ దాఖలు

మైలవరం: నామినేషన్ల ఘట్టం ప్రారంభమైన గురువారం మైలవరం నియోజకవర్గానికి సంబంధించి ఒకేఒక్క నామినేషన్ దాఖలయిందని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కొండపల్లికి చెందిన వల్లభనేని నాగ పవన్ కుమార్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారని చెప్పారు.

ఎస్ఈబీ దాడుల్లో ముగ్గురి అరెస్ట్



తిరువూరు: అక్రమ మద్యం, సారా రవాణాను నియంత్రించేందుకు గురువారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు తిరువూరు సర్కిల్లో దాడులు నిర్వహించారు. గంపలగూడెం మండలం అమ్మిరెడ్డిగూడెంలో సారా విక్రయిస్తున్న చప్పిడి కృష్ణకుమారి నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. నెమలిలో అధికారులు జరిపిన దాడుల్లో 15 తెలంగాణ మద్యం సీసాలతో యాదాల జయరాజ్ పట్టుబడ్డాడు. ఎ. కొండూరు మండలం గొల్లమందల తండాలో దారావత్ బద్దు నుంచి 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని అదుపులోకి తీసుకున్నారు. నిందితులను తిరువూరు కోర్టులో హాజరుపరిచామని ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపారు.

వైభవంగా మహా పట్టాభిషేకం



చాట్రాయి: శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా గురువారం మండలంలోని చనుబండ కోదండ రామాలయంలో మహాపట్టాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం 11 గంటలకు ఆలయం నుంచి స్వామివార్లను మేళాతాళాలతో పల్లకిలో తీసుకెళ్లి కల్యాణ మండపంపై ఆశీనులను గావించారు. వేదపండితులు శ్రీసుదర్శనం మదన్ శ్రీనివాసాచార్యులు, యాజ్ఞికులు మహాపట్టాభిషేకాన్ని భక్తులకు వివరించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. ఏపీ కోఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి, అన్నదాన కమిటీ సభ్యులు జీ సుబ్బారావు, కే లక్ష్మణరావు, వీ వాసు, పరమేశ్వరావు, వెంకటేశ్వరరావు, చిన బాబు, శివ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11 కేవీ పుష్కర ఘాట్ విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం ఉదయం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీ సీపీడీసీఎల్ ఈఈ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. నూజివీడు పంపింగ్ స్కీమ్, గొల్లపూడి వాటర్ వర్క్స్, కృష్ణా కరకట్ట, లైబ్రరీ వీధి, సారా కొట్టు సెంటర్, మసీదు ఏరియా, రామాలయం టెంపుల్ ఏరియా వరకు ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ మృతి

తిరువూరు: భర్త మృతితో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యాయత్నం చేసిన తిరువూరుకు చెందిన బత్తుల రాములమ్మ (35) గురువారం మృతి చెందింది. తిరువూరు ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. తిరువూరు పట్టణానికి చెందిన రాములమ్మ భర్త కొన్ని రోజుల కిందట మరణించాడు. ఇద్దరు కుమారులను పోషించలేక, కుటుంబం గడవక ఈ నెల 11న రాములమ్మ పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. ఆమెను ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది.

గోశాలకు వరి గడ్డి వితరణ

పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీతిరుపతమ్మవారి గోశాలలో గోవుల కోసం గురువారం తెలంగాణ రాష్ట్రం, సూర్యాపేట జిల్లా గొండ్రియాల గ్రామానికి చెందిన రైతు బండ్ల వెంకటయ్య రూ.13 వేల విలువైన వరి గడ్డిని అందజేశారు. తన సొంత ఖర్చులతో ట్రాక్టర్‌పై గడ్డిని తెచ్చి అందజేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. దాతకు ఆలయ సిబ్బంది అమ్మవారి ప్రసాదాలు అందజేశారు. మండలంలోని సుబ్బాయిగూడెం గ్రామానికి చెందిన వెల్ది ప్రభాకరరావు రూ.6,500 విలువ చేసే వరి గడ్డిని సొంత ఖర్చులతో ట్రాక్టర్‌పై తీసుకొచ్చి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ కె.రమేష్‌నాయుడు మాట్లాడుతూ ఎవరైనా దాతలు ఉంటే గోవుల కోసం వరి గడ్డి అందజేయాలని కోరారు.

సరికొత్తగా సర్కారు బడులు

- ప్రగతి పథంలో ప్రభుత్వ పాఠశాలలు
- 'నాడు–నేడు'తో మారిన రూపురేఖలు
- సమకూరిన మౌలిక వసతులు
- రూ.25.59 కోట్లతో 118 పాఠశాలల అభివృద్ధి



కొండపల్లిలో సుందరంగా మారిన గిరిజన గురుకుల సంక్షేమ బాలికల పాఠశాల భవనం

ఇబ్రహీంపట్నం: విద్యతోనే అసమానతలు, పేదరికం తొలగుతాయని భావించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చింది. ఇందుకోసం పలు పథకాలను అమలు చేసింది. నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చివేసింది. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడంతోపాటు మౌలిక వసతులు కల్పించింది. ఇంగ్లిష్ మీడియం విద్యతోపాటు జగనన్న విద్యా కానుక, అమ్మ ఒడి తదితర పథకాలను అమలు చేయడంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు మెరుగైన ఫలితాలు సాధించడం, డ్రాప్ అవుట్స్ సంఖ్య తగ్గించేందుకు 2019 నవంబర్ 14న ఈ పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. ఈ పథకం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేసి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా వసతులు కల్పించారు. నియోజకవర్గంలోని రెడ్డిగూడెం, మైలవరం, విజయవాడ రూరల్, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం మండలాల్లో రూ.25,59,12,475 నిధులతో 118 పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో అభివృద్ధి పనులు జరిగాయి. అభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో జరిగిన పనులను సమగ్ర శిక్ష అధికారులు నిరంతర పర్యవేక్షించారు. నాడు నేడు ఫేజ్–1 పనులు పూర్తి చేసుకుని ఫేజ్–2 పనులు సైతం పూర్తికావచ్చాయి.

పాఠశాలల్లో అన్ని వసతుల కల్పన

నాడు–నేడు పథకం ద్వారా ప్రతి పాఠశాలలో తొమ్మిది రకాల సదుపాయాలను ప్రభుత్వం కల్పించింది. అందుకు అనుగుణంగా నిధులు కేటాయించింది. అదనపు తరగతి గదులతో పాటు టాయిలెట్లు ఆధునికీకరణ, నిరంతర నీటి సదుపాయం, ప్రతి గదికి ఫ్యాన్, లైట్లు, రక్షిత తాగునీటికి ఆర్వో ప్లాంట్, విద్యార్థులకు నూతన బల్లలు, కుర్చీలు, కిచెన్‌షెడ్లు, ఆకర్షణీయమైన రంగులు, ప్రతి గదిలో గ్రీన్‌చాక్ బోర్డులు, డిజిటల్ విద్యకు ఎస్‌సీడీ బోర్డులు, ల్యాబ్ సదుపాయాలు కల్పించారు. ప్రతి పాఠశాలలో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో విద్యార్థులకు విద్యా బోధన జరుగుతోంది. మౌలిక సదుపాయాలు మెరుగు కావడం, ఇంగ్లిషు మీడియంలో మంచి ఫలితాలు సాధించడంతో ప్రభుత్వ పాఠశాలల్లో గడిచిన ఐదేళ్లల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది.

మండలం	స్కూల్స్	ఎంపికైనవి	నిధులు మంజూరు (రూ. కోట్లు)
మైలవరం	51	16	6.64,40,000
ఇబ్రహీంపట్నం	36	30	8,02,00,000
జి.కొండూరు	44	32	4,88,00,000
రెడ్డిగూడెం	42	29	4,92,00,000
విజయవాడ రూరల్	05	05	1,51,92,475

విద్యతో పాటు ఆరోగ్యం

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యతో పాటు ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. విద్యార్థుల చదువుకు కావల్సిన వస్తువులు జగనన్న విద్యా కానుక పథకంలో అందజేశారు. చదువులో రాణించాలంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని జగనన్న గోరుముద్ద పథకం ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నారు. రోజుకొక మెనూతో కోడిగుడ్డు, రాగిరావ, చిక్కీ వంటివి అందిస్తున్నారు. పరిశుభ్రమైన వాతావరణం, సంపూర్ణ ఆరోగ్యంతో విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాలల్లో జరుగుతున్న అన్ని అంశాలు ప్రతి రోజు ప్రత్యేక యాప్ ద్వారా ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తూ పారదర్శకతకు పెద్దపీట వేశారు.

నాణ్యతతో భవన నిర్మాణాలు



నాడు–నేడు పనుల నాణ్యతలో రాజీ లేకుండా నిర్మాణం చేపట్టారు. పాఠశాల పేరెంట్స్ కమిటీలు, హెచ్ఎంలు, సర్వశిక్ష కార్యాలయ సిబ్బంది నిరంతర పర్యవేక్షణలో నాణ్యతతో కూడిన పనులు జరిగాయి. ఫేజ్–1 పనులు పూర్తయ్యాయి. ఫేజ్–2 పనులు కూడా పూర్తికావచ్చాయి. నాడు– నేడుతో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు సమకూరాయి.

– సీహెచ్ పుష్పలత, ఎంఈఓ, ఇబ్రహీంపట్నం



కేతనకొండలో రూపురేఖలు మారిన ఎంపీపీ పాఠశాల భవనం



మూలపాడు జెడ్పీ పాఠశాలలో తాగునీటి కోసం ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటు



ఇబ్రహీంపట్నం ఎంపీపీ పాఠశాలలో ఏర్పాటు చేసిన బెంచీలు

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించండి

నల్లగట్ల స్వామిదాసు



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న స్వామిదాసు

నెమలి/ఉమ్మడదేవరపల్లి(గంపలగూడెం): ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని వైఎస్సార్ సీపీ తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు ఓటర్లను అభ్యర్థించారు. గంపలగూడెం మండలం ఉమ్మడ దేవరపల్లిలో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓట్లు చేసి గెలిపించాలని కోరారు. సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే వైఎస్ జగనన్నను మరోసారి ముఖ్యమంత్రి కావాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా వలంటీర్ల రాజీనామా



రాజీనామా పత్రాలు చూపుతున్న వలంటీర్లు

ఇబ్రహీంపట్నం: మండల పరిధిలోని మూలపాడు, త్రిలోచనాపురం గ్రామ సచివాలయాల పరిధిలోని 32 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ ఉమాదేవికి గురువారం అందజేశారు.

సామాన్యుడి వెనుక ప్రజా బలం ఉంది

మాజీ ఎమ్మెల్యే జ్యేష్ఠ రమేష్‌బాబు



మీడియాతో మాట్లాడుతున్న జ్యేష్ఠ రమేష్‌బాబు, సర్నాల తిరుపతిరావు తదితరులు

జి.కొండూరు: వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు వెనక ఉన్న ప్రజా బలాన్ని చూసి కూటమి నాయకులకు ఓటమి భయం పట్టుకుందని మాజీ ఎమ్మెల్యే జ్యేష్ఠ రమేష్‌బాబు అన్నారు. కుంటముక్కల గ్రామంలోని ఆయన నివాసంలో గురువారం మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గంలో 80 శాతం మంది పేదలు, మధ్య తరగతి ప్రజలే ఉన్న క్రమంలో స్థానికుడైన సామాన్యుడు సర్నాల తిరుపతిరావుకి సీటిచ్చి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పట్ల తనకున్న చిత్తశుద్ధిని చాటుకున్నారన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యేలుగా గెలిచిన స్థానికేతురులంతా సహజ వనరుల దోపిడీకి పాల్పడుతూ వారు ఆర్థికంగా ఎదగడమే తప్ప ప్రజల ఆర్థిక ఎదుగుదలకు ఏమాత్రం దోహదపడలేదని విమర్శించారు. సామాన్యుడైన సర్నాల తిరుపతిరావుకు ప్రజాబలంతో పాటు తన లాంటి సీనియర్ నాయకుల సపోర్టు కూడా ఉందన్నారు.

ఓటమి భయంతోనే కించపరిచే వ్యాఖ్యలు..

వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు మాట్లాడుతూ తనను కించపరుస్తూ వ్యాఖ్యలు చేస్తున్న నాయకులు అంతా రాజకీయంగా ఎలా ఎదిగారో చెప్పాలని ప్రశ్నించారు. పుట్టిన గ్రామానికి హద్దులు కూడా తెలియని నాయకులు తనపై వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వసంత వెంకటకృష్ణప్రసాద్ మైలవరం వీరప్పన్ అని, వందకోట్లు పెట్టి సీటు కొన్నాడని దేవినేని ఉమానే స్వయంగా చెప్పాడని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీలో ఎమ్మెల్యేగా పనికి రాడని పక్కన పెట్టిన వ్యక్తి మరలా టీడీపీలో చేరి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. నాడు తానే అభివృద్ధి చేశానని ప్రగల్భాలు పలికిన వసంత, నేడు అభివృద్ధి జరగలేదని అసత్యాలు ప్రచారం చేస్తున్నాడని విమర్శించారు. ప్రజలు, జగనన్న అండతో ఎమ్మెల్యేగా గెలుపొంది చరిత్ర సృష్టిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

ఎన్ని కంటైనర్ల డబ్బు ఇచ్చి సీటు కొన్నారు..

నియోజకవర్గ పరిశీలకుడు కర్రా హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ మూడు సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన దేవినేని ఉమాని తప్పించి వసంతకు సీటిచ్చారంటే చంద్రబాబుకి ఎన్ని కంటైనర్ల డబ్బు ఇచ్చారో చెప్పాలన్నారు. టీడీపీలో సీటు కోసం ప్రయత్నించి విఫలమై వైఎస్సార్ సీపీ ఆదరణతో ఎమ్మెల్యేగా గెలుపొంది ఐదేళ్లు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ చేసిన నిర్వాకాన్ని దుమ్మెత్తి పోసిన పార్టీలోనే నేడు చేరి నీతులు మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నియోజకవర్గ మరో పరిశీలకుడు అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో జగనన్న సంక్షేమ వెలుగులు నింపారని, అవే నేడు సామాన్యుడైన సర్నాల తిరుపతిరావుకి వెన్నెముకలా పనిచేస్తాయని చెప్పారు. ఈ నెల 20న ఉదయం 11 గంటలకు తిరుపతిరావు నామినేషన్ వేస్తారని చెప్పారు.

నామినేషన్ దాఖలు చేసిన స్వామిదాసు



తిరువూరులో నామినేషన్ దాఖలు చేస్తున్న నల్లగట్ల స్వామిదాసు

తిరువూరు: వైఎస్సార్ సీపీ తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గంపలగూడెం మండలం నెమలి వేణుగోపాలస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తిరువూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి ప్రదర్శనగా కోకిలంపాడు రోడ్డులోని రెవెన్యూ డివిజినల్ కార్యాలయానికి చేరుకున్నారు. రిటర్నింగ్ అధికారి కె. మాధవికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. స్వామిదాసు పేరును ఎమ్మెల్యే అభ్యర్థిగా ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి ప్రతిపాదించారు. పార్టీ పరిశీలకులు పూనూరి గౌతంరెడ్డి, తిరువూరు ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ రేగళ్ల మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ తిరువూరు పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ, ఎ.కొండూరు జెడ్పీటీసీ భూక్యా గన్యా తదితరులు పాల్గొన్నారు. స్వామిదాసు నామినేషన్ దాఖలు కార్యక్రమానికి నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన కార్యకర్తలు, అభిమానులు విజయవాడ రోడ్డులోని పార్టీ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు.

స్వామిదాసు విజయం తథ్యం: గౌతంరెడ్డి

తిరువూరు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ గెలుపు తథ్యమని, పార్టీ అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు అఖండ మెజారిటీతో విజయం సాధిస్తారని పార్టీ పరిశీలకులు పూనూరి గౌతంరెడ్డి అన్నారు. తిరువూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా స్వామిదాసు గురువారం నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా గౌతంరెడ్డి మాట్లాడుతూ తిరువూరు వైఎస్సార్ సీపీకి కంచుకోట అని, గతంలో కంటే మంచి మెజారిటీతో గెలుస్తామన్నారు. నానాటికీ ప్రజాదరణ పెరుగుతోందని, ప్రభుత్వం గత ఐదు సంవత్సరాల్లో చేసిన సంక్షేమ, అభివృద్ధి పనులు చూసి ప్రజలు మళ్లీ వైఎస్సార్ సీపీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

అందరికీ పథకాలు అందజేసిన జగన్

- మళ్లీ ఆదరించండి.. మరింత మేలు చేస్తాం
- చంద్రబాబును నమ్మితే మోసపోతారు
- నూజివీడు ఎమ్మెల్యే అభ్యర్థి మేకా ప్రతాప్ అప్పారావు



అడవినెక్కలంలో ప్రచారం నిర్వహిస్తున్న మేకా ప్రతాప్ అప్పారావు

ఆగిరిపల్లి: ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేస్తే సంక్షేమ పథకాలు రద్దు చేస్తారని వైఎస్సార్ సీపీ నూజివీడు ఎమ్మెల్యే అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. గురువారం అడవినెక్కలం, నెక్కలం గొల్లగూడెం, కనసానపల్లి గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారరథంపై నుంచి అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఆయా గ్రామాల్లో ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఐదేళ్లపాటు ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించారన్నారు. ఈ ఐదేళ్లు ఎక్కడా కనిపించని టీడీపీ నేతలు ఇప్పుడు ఎన్నికలు దగ్గర పడటంతో హడావుడి చేస్తున్నారని ఎద్దేవా చేశారు. అధికారం కోసం ఆచరణ సాధ్యం కాని హామీలు ఇస్తున్నారని విమర్శించారు. చంద్రబాబును నమ్మితే నష్టపోవాల్సి వస్తుందని హెచ్చరించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనే దమ్ములేక చంద్రబాబు కనిపించిన ప్రతి పార్టీతోనూ పొత్తు పెట్టుకుంటున్నారని అన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ప్రజలకు చేసిన మేలు శూన్యమని చెప్పారు. మహిళలను మహారాణులుగా, వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తోన్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ప్రజల అభిమానం చూస్తుంటే తాను ఈసారి కూడా భారీ మెజార్టీతో గెలవబోతున్నానని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పిన్ని బోయిన వీరబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పల్లగాని నరసింహారావు, జిల్లా కార్యదర్శి మచ్చా హరిబాబు, సర్పంచులు వేమరాజు, లింగవరపు రమేష్, అమ్మిశెట్టి సంజీవరావు, అత్తి మురళి, ఎంపీటీసీలు గుర్రం శ్రీనివాసరావు, కారు తేజస్విని, పల్లె రవీందర్ రెడ్డి, తోటకూర విష్ణుమూర్తి, మొక్కపాటి వెంకటేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని మరోసారి ఆదరించండి

మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి తిరుపతిరావు



గొల్లపూడిలో ప్రచారం చేస్తున్న తిరుపతిరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు విజ్ఞప్తి చేశారు. గొల్లపూడి పంచాయతీ పరిధిలోని సారా కొట్టు ప్రాంతంలో గురువారం సాయంత్రం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. తమకు అన్ని పథకాలు అందుతున్నాయని లబ్ధిదారులు సంతృప్తి వ్యక్తం చేశారు. వలంటీర్లు ప్రతి నెలా ఒకటో తేదీ వేకువ జామునే ఇంటికి వచ్చి పింఛన్ అందజేసేవారని, అటువంటి వలంటీర్లను చంద్రబాబు కూటమి అడ్డుకుందని పలువురు పింఛన్‌దారులు ఆగ్రహం వ్యక్తంచేశారు. అవ్వాతాతలు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల ఉసురు చంద్రబాబుకు తగులుతుందని ధ్వజమెత్తారు. మళ్లీ జగన్‌బాబే ముఖ్యమంత్రి కావాలని, వలంటీర్లు మళ్లీ ఇంటింటికీ వచ్చి పింఛన్ అందించాలని ఆకాంక్షించారు.

పేదవారి కష్టాలు సీఎం జగన్‌కు తెలుసు..

పేదవారి కష్టాలు, ముఖ్యంగా లేవలేని, కదలలేని పింఛన్‌దారుల ఇబ్బందులు సీఎం జగనన్నకు తెలుసని తిరుపతిరావు అన్నారు. వలంటీర్ వ్యవస్థ లేకపోతే ఎదురైన పరిస్థితులను చూసే యూటర్న్ తీసుకున్న చంద్రబాబు దిగి వచ్చి వలంటీర్ల గౌరవ వేతనాన్ని రూ.10 వేలు ఇస్తానని చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. అప్పటి వరకు వలంటీర్లను చెప్పులతో కొట్టాలని చంద్రబాబు, ఉమెన్ ట్రాఫికింగ్‌కు పాల్పడుతున్నారని పవన్ కల్యాణ్, టెర్రరిస్టులని టీడీపీ నాయకుడు బొజ్జల సుధీర్ ఇలా కూటమి నాయకులు అనేకమంది వారిపై ఆరోపణలు చేయడం దుర్మార్గమన్నారు. నిప్పు అని చెప్పుకునే చంద్రబాబు వలంటీర్లపై నిందలు వేసి చేతులు కాల్చుకున్నాడని ఎద్దేవా చేశారు. వలంటీర్లు మళ్లీ ఇంటింటికి వచ్చి పింఛన్ అందించాలంటే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



నూజివీడు 32వ వార్డులో ప్రచారం చేస్తున్న మేకా వేణుగోపాల అప్పారావు

నూజివీడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు తనయుడు మేకా వేణుగోపాల అప్పారావు (చంటినాయన) అన్నారు. నూజివీడు 32వ వార్డులో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చంటినాయన మాట్లాడుతూ కరోనాతో రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందులకు గురైనా బాధితులకు అత్యుత్తమ చికిత్స అందించడంతో పాటు వారిని అన్నివిధాలుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆదుకుందని గుర్తుచేశారు. ఆరోగ్యశ్రీ వైద్యం ఖర్చు పరిధిని రూ. 25 లక్షలకు పెంచిందన్నారు. జగనన్న చేసిన మేలును ఎవరూ మరువద్దని కోరారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి నాయకులు ఇచ్చే మోసపూరిత హామీలను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. రాష్ట్రంతో పాటు నూజివీడు నియోజకవర్గంలో అభివృద్ధి జరగాలంటే మరోసారి వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావాలన్నారు. వచ్చే నెలలో జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌లను గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, మాజీ వైస్‌చైర్మన్ పగడాల సత్యనారాయణ, కౌన్సిలర్లు నవుడు నాగమల్లేశ్వరరావు, దాసరి అప్పాజీ, నాయకుడు ఆదపురెడ్డి నాగేశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటమి భయం.. మారుతున్న వసంత స్వరం

సాక్షి పేపర్ చదవొద్దు అంటూ ప్రచారం

ఇబ్రహీంపట్నం: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేగా నిన్న మొన్నటి వరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతున్నాయని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ మీడియా ముఖంగా ప్రచారం చేశారు. ఇటీవల టీడీపీలో చేరిన ఆయన అధినేతను ప్రసన్నం చేసుకునేందుకు అభివృద్ధి జరగలేదని, అమరావతి రాజధానిపై తప్పుడు ప్రచారం ప్రారంభించారు. అయినా ప్రజల నుంచి స్పందన కరవైంది. ఓటమి భయంతో ఇప్పుడు స్వరం మార్చారు. ఇబ్రహీంపట్నం 12, 13 వార్డుల్లో గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో చాలా ఇళ్లల్లో సాక్షి పేపర్ కనిపించింది. దీంతో ఓటు అడగటం మరిచి సాక్షి పేపర్ చదవద్దు అంటూ ఓటర్లకు సూచించారు. ఏ ఎండకు ఆ గొడుగు పట్టే కృష్ణ ప్రసాద్ తీరుకు ఆ పార్టీ నాయకులే ముక్కున వేలేసుకుంటున్నారు. ఓవైపు కూటమి నాయకులు సహకరించకపోవడం, ప్రతి గ్రామంలో 90 శాతం కుటుంబాలకు సంక్షేమం అందడంతో ఓటమి తప్పదని ముందే గ్రహించిన వసంత సాక్షిపై అక్కసు వెళ్లగక్కుతున్నాడనే చర్చ సాగుతోంది.